మెనూ నిండా పోషకాలు

- జనం చూపు బలవర్ధక ఆహారం వైపు
- ఆరోగ్యకరజీవన శైలి కోసం సంప్రదాయ వంటకాలపై దృష్టి
- నేటి నుంచి జాతీయ పోషకాహార వారోత్సవాలు

ఇటీవల కాలంలో ఆహారం విషయంలో ప్రజల దృష్టి మారింది. చాలా మంది ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకర జీవనశైలికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు తీసుకునే ప్రతి ఆహారంలో పోషకాలు ఉండేలా మెనూలో మార్పులు చేసుకుంటున్నారు. సెప్టెంబర్ మొదటి వారం జాతీయ పోషకాహార వారోత్సవం నేపథ్యంలో పోషకాహార ప్రాముఖ్యతపై ప్రత్యేక కథనం.



పోషకాలున్న ఆహారం

పిల్లల్లో ఉండాల్సిన బరువు, ఎత్తు

వయస్సు	ఎత్తు (సెం.మీ)	బరువు (కిలోలు)
పుట్టినప్పుడు	48.3	2.9
3 నెలలు	60.2	5.7
6 నెలలు	65.0	7.0
9 నెలలు	68.7	7.9
12 నెలలు	73.4	9.0
2 సంవత్సరాలు	84.2	11.5
3 సంవత్సరాలు	89.7	12.5
4 సంవత్సరాలు	96.2	14.9
5 సంవత్సరాలు	105.0	17.5

కర్నూలు(హాస్పిటల్): మనం ఏది తిన్నా అందులో నాలుగు పోషకాలుండాలన్న కాన్సెప్ట్ ప్రజల్లో పెరిగిపోయింది. ప్రజల ఆకాంక్షల మేరకు మార్కెట్‌లో నిత్యావసర సరుకుల కిట్లూ మారిపోయాయి. బియ్యం, కందిబేడలు, రవ్వలు, పప్పులతో పాటు తృణధాన్యాలైన కొర్రలు, అరికెలు, సామలు, అండుకొర్రలు, ఊదలు ఉంటున్నాయి. అలాగే చిరుతిళ్లల్లో భాగంగా ఆరగించడానికి బాదాములు, జీడిపప్పులు, కిస్‌మిస్‌లు, గసగసాలతో తయారు చేసిన చిరుతిళ్లను ఉంచుతున్నారు. పెద్ద పెద్ద మార్టులకు వెళ్లినా, చిన్న సూపర్‌మార్కెట్‌లకు వెళ్లినా ఇదే వరుస మనకు కనిపిస్తుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోషకాలను వెతికి మరీ పట్టుకుంటున్నారు. ఇదివరకులాగా ఆకలేస్తే పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లి రెండు బంగాళదుంప చిప్స్ ప్యాకెట్లు లేదా బేకరికి వెళ్లి వేడి వేడి సమోసాలు తెచ్చుకుని తినడాన్ని తగ్గించేశారు. ఎక్కువ కాలంలో నిల్వ చేసిన, ప్రాసెస్డ్ ఫుడ్ తిని రోగాలు కొని తెచ్చుకునే బదులు అప్పటికప్పుడు ఇంట్లో తయారు చేసుకుని తింటే మేలని భావిస్తున్నారు.

తక్కువగా ఉప్పు, స్వీట్, కొవ్వులు

ఒకప్పుడు ఇంటికి స్వీట్ ప్యాకెట్ తీసుకొస్తే మరుసటి రోజు ఒక్కటి ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ ప్యాకెట్‌లో స్వీట్లు వారం రోజుల పాటు అలాగే ఉంటున్నాయి. జనానికి స్వీట్లపై మక్కువ తగ్గిపోయింది. ఒక వైపు షుగర్ రోగులు పెరిగిపోవడం, మరోవైపు స్వీట్లు ఎక్కువగా తింటే తమకూ భవిష్యత్‌లో షుగర్ వస్తుందేమోనన్న భయం, ఇంకో వైపు లావైపోతామన్న ఆందోళనతో వాటికి దూరంగా ఉంటున్నారు. ఇదే సమయంలో నూనెలో ఈతకొట్టి వచ్చిన సమోసాలు, ఆలూ బజ్జీలు కూడా అలా ముట్టి వదిలేస్తున్నారు. టిఫిన్‌లో పూరీలు, వడలు జోలికి వెళ్లే వారి సంఖ్య కూడా ఇటీవల గణనీయంగా తగ్గిపోయింది. శుభ్రంగా ఇడ్లీలు, నూనెలేని చపాతీలు, పొంగల్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏది తిన్నా అందులో ఉప్పు, నూనె తక్కువగా ఉండాలని ముందే చెబుతున్నారు.

సంప్రదాయ చిరుతిళ్లవైపు చూపు

మన అమ్మమ్మ, నాన్నన్నల కాలం నాటి వంటకాల వైపు జనం మళ్లారు. సాయంత్రం పాఠశాల నుంచి పిల్లలు రాగానే అందులో నుంచి జంతికలు, మురుక్కులు, కర్జికాయలు, అత్తరాసలు తీసి చేతికి ఇచ్చేవారు. అయితే, ఇప్పుడు ఇంట్లో వాటిని తయారు చేసే సమయం, మనుషులు లేరు కాబట్టి అవి చేసే దుకాణాల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి పిల్లలకు తినిపిస్తూ పెద్దలు ఆరగిస్తున్నారు. ఈ మేరకు కర్నూలు నగరంలోని పాతబస్తీతో పాటు గాంధీనగర్, సెంట్రల్ ప్లాజా, మద్దూర్‌నగర్, వెంకటరమణకాలని, నంద్యాల రోడ్డు తదితర ప్రాంతాల్లో సంప్రదాయ వంటకాలు విక్రయించే దుకాణాలు అధిక సంఖ్యలో వెలిశాయి.

పెద్దాసుపత్రిలో ఎన్‌ఆర్‌సీ

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్న పిల్లల విభాగంలో ఉన్న న్యూట్రిషియన్ రిహాబిటేషన్ సెంటర్(ఎన్‌ఆర్‌సీ)కు ప్రతి సంవత్సరం 350 నుంచి 400 మంది ఓపీ రోగులు, 200 నుంచి 300 ఇన్‌పేషెంట్లుగా ఆరు నెలల నుంచి 60 నెలల చిన్నారుల వరకు చికిత్స పొందుతున్నారు. ఇక్కడ చేరే వారిలో అధికమంది పోషకాహారలోపంతో బాధపడే వారే ఉంటారు. వీరికి మందులతో పాటు అవసరమైన పోషకాహారాన్ని సమయానుసారంగా ఇవ్వడం ద్వారా రెండు, మూడు వారాల్లోనే పిల్లలు ఎత్తుకు తగిన బరువుతో ఇంటికి డిశ్చార్జ్ అయి వెళ్తున్నారు. పోషకాహారలోపం కారణంగానే చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తి తక్కువై వివిధ వ్యాధుల బారిన పడుతున్నారని, వారికి సరైన పోషకాహారాన్ని అందించాలని పిల్లల తల్లిదండ్రులకు వైద్యులు సూచిస్తున్నారు.

పిల్లలకు సమతుల ఆహారం ఇవ్వాలి



పోషకాహారలోపంతో పిల్లలకు తరచుగా ఇన్‌ఫెక్షన్లు సోకుతుంటాయి. వయస్సుకు తగ్గ బరువు ఉండకపోవడం లేదా అధిక బరువు ఉండటం, ఐరన్ లోపం వల్ల రక్తహీనత మొదలైన సమస్యలు అధికమవుతున్నాయి. వీటిని అధిగమించాలంటే ఆకుకూరలు, పండ్లు ఉన్న ఆహారాన్ని అలవాటు చేయాలి. ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లలకు మెత్తని ఆహారాన్ని, ఆ తర్వాత ఇంట్లో అందరూ ఏమి తింటారో వాటినే తినిపించాలి. అయితే వారికి సమతుల ఆహారాన్ని తప్పనిసరిగా ఇవ్వాలి.

–డాక్టర్ పి. రవీంద్రనాథ్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, చిన్నపిల్లల విభాగం, జీజీహెచ్, కర్నూలు

పోషకాలున్న ఆహారంతోనే ఆరోగ్యం



నోటికి రుచిగా ఉందని బయటి ఆహారాన్ని అతిగా తింటే దానివల్ల శరీరానికి కేలరీలు వస్తాయే గానీ పోషకాలు అందవు. పోషకాహారం లేకపోతే శరీరం వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోలేదు. పోషకాహారలోప సమస్య కారణంగానే మహిళలకు 30 ఏళ్లకే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వయస్సు ప్రకారం పోషకాహారాలు తీసుకుంటే సమస్యల నుంచి సాధ్యమైనంత వరకు బయటపడవచ్చు. అయితే, ప్రతి ఒక్కరూ తాము ఏమి తింటున్నాం, ఎంత తింటున్నామన్నది గుర్తించి తినడం అలవాటు చేసుకోవాలి.

–డాక్టర్ జి. రమాదేవి, పోషకాహార నిపుణురాలు, కర్నూలు

అనుభవం చాలా విలువైనది

- రిటైర్డ్ వైద్యుల సన్మాన కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన వైద్యులకు ఘనంగా సన్మానించారు. శనివారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్‌క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చెందిన బయోకెమిస్ట్రీ హెచ్‌ఓడీ డాక్టర్ పద్మవిజయశ్రీ, ఈఎన్‌టీ హెచ్‌వోడి డాక్టర్ సి.వెంకటేశ్వరరావు (సీవీ రావు)లను సన్మానించారు. ఈ సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వారిద్దరూ ఆసుపత్రిలో సుదీర్ఘకాలం విశేష సేవలందించారని కొనియాడారు. వైద్య విద్య బోధకులకు రిటైర్‌మెంట్ లేదని, వారు నిరంతరం ఏదో ఒక చోట వారి అనుభవ పాఠాలు, నైపుణ్యాలు కాబోయో వైద్యులకు నేర్పిస్తూ ఉండాలని కోరారు. ప్రభుత్వ సర్వీసు పరంగా మాత్రమే రిటైర్‌మెంట్ అని, ఎన్నో ఏళ్లు గడిచిన అనుభవం చాలా విలువైనదని అన్నారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ వెంకటరమణ, ఏపీజీడీఏ ట్రెజరర్ డాక్టర్ శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డాక్టర్ సోమప్ప, డాక్టర్ హేమనళిని, అసోసియేషన్ నాయకులు డాక్టర్ రామకృష్ణానాయక్, డాక్టర్ రామశివనాయక్ పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ సీజ్ రూ.3 లక్షలు జరిమానా

కర్నూలు (టౌన్): ఒంగోలు నుంచి హైదరబాదుకు అక్రమంగా గెలాక్సీ గ్రానైట్ తరలిస్తున్న లారీని మైనింగ్ అధికారులు శనివారం సీజ్ చేవారు. నగర శివారులోని నన్నూరు టోల్ ప్లాజా వద్ద లారీని ఆపి రికార్డులు పరిశీలించారు. గ్రానైట్ తరలింపునకు ఎలాంటి రికార్డులు లేకపోవడంతో యజమాని శంకర్ రెడ్డి నుంచి రూ.3 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

క్లుప్తంగా

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం



రామచందర్ దంపతులను సత్కరిస్తున్న నగరపాలక ఉద్యోగులు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన ఎ.రామచందర్, అలాగే ఇటీవల పదవి విరమణ చేసిన అరుణకుమారిని శనివారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, రెవెన్యూ ఆఫీసర్లు జునీద్, ఇశ్రాయేలు, టీపీఆర్‌ఓ వెంకట లక్ష్మి సూపరింటెండెంట్లు మంజూర్ బాషా, ప్రసాద్ గౌడ్, స్వర్ణలత, సీనియర్ అసిస్టెంట్లు శ్రీకాంత్, రామక్రిష్ణా, సాధిక్, శ్రీదేవి, ఎస్‌ఓ శోభారాణి, సుధా గ్రేస్ పాల్గొన్నారు.

ఆర్‌డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): భారీ వర్షాల నేపథ్యంలో కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఓ కార్యాలయంతోపాటు డివిజన్‌లోని అన్నిమండల కేంద్రాల్లో తహసీల్దార్ కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, వర్షాలతో ఏమైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా, వర్షంలో ఇరుక్కొని ఇబ్బంది పడుతున్నా కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని సూచించారు. ఆర్‌డీఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో 6303756113, 9912069678 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

గ్రీన్‌కోకు భూములు ఇవ్వడం అన్యాయం

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ, దాని చుట్టు పక్కల గ్రామాల రైతులకు చెందిన భూములు సోలార్ పార్కు కోసం గ్రీన్ కో సంస్థకు ఇవ్వడం అన్యాయమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దాదాపు 2 వేల ఎకరాల భూములను సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అదే జరిగితే సన్నా, చిన్నకారు రైతులు భూములు లేకుండా కూలీలుగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇక్కడ ఎకరం రూ.50 లక్షల విలువ చేస్తుందన్నారు.ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలన్నారు.

నగర పాలక ఇన్‌చార్జ్ కమిషనర్ బదిలీ

కర్నూలు (టౌన్): నగరపాలక అదనపు కమిషనర్, ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.వి.రామలింగేశ్వర్ బదిలీ అయ్యారు. వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా ఆయనను బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యలకు నిధి గణపతి

శ్రీశైలంటెంపుల్: విద్యలకు నిధిగా గణపతిని ఆరాధిస్తారని, అక్షరగణపతిగా ఆ హేరంబుని పూజించి విద్యాబుద్ధులు పొందుతారని అందుకే విద్యార్థులకు కూడా గణపతి అభీష్టదైవమని ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గణపతి గాథలు ప్రవచనాలు శనివారం ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. ప్రవాచకులు మాట్లాడుతూ గణపతి మహర్షులకు కూడా సిద్ధి ప్రదాత అన్నారు. వ్యాసమహర్షికి బ్రహ్మదేవుడు గణపతి మంత్రాలను ఉపదేశించాడని, గణపతి అనుగ్రహంతో వ్యాసమహర్షి అష్టాదశ పురాణాలను రాయగలిగాడని చెప్పారు. సందర్భానుసారంగా శ్రీశైలక్షేత్ర మహిమలను కూడా వివరించారు.

నందీశ్వరస్వామికి పరోక్ష సేవ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి శనివారం త్రయోదశి సందర్భంగా శాస్త్రోక్తంగా అర్చకులు పరోక్షసేవను నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజులలో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. నందీశ్వర పరోక్షసేవలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి మొత్తం 28మంది భక్తులు పాల్గొన్నారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ జరిపించారు. తరువాత నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతో, ఫలోదకాలతో అలాగే మల్లికా గుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానబెట్టిన శనగలను ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

విజ్ఞాన సదస్సులతో మరింత అవగాహన

- కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): విజ్ఞాన సదస్సుల ద్వారా వైద్య విద్యార్థులకు వారి సబ్జెక్టుల్లో మరింత అవగాహన లభిస్తుందని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో శనివారం కళాశాలలోని న్యూ ఆడిటోరియంలో 'వాస్కులర్ అనామలస్' అనే సబ్జెక్టుపై జోనల్ సీఎంఈ నిర్వహించారు. ×రక్తనాళాల్లో ఏర్పడే వైకల్యాలు, వాటి చికిత్సలో వచ్చిన అధునాతన వైద్య విధానాలు, ఏర్పడే అడ్డంకులు, వాటిని అధిగమించే మార్గాలపై జోనల్ స్థాయిలో వివిధ మెడికల్‌కాలేజీల నుంచి వచ్చిన వైద్యులు తమ ప్రజెంటేషన్స్‌ను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి సీఎంఈల వల్ల పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు సబ్జెక్టుపై మరింత పట్టు వస్తుందని తెలిపారు. అదే విధంగా నూతన ఆవిష్కరణలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ మంజులబాయి మాట్లాడుతూ రక్తనాళాల్లో ఏర్పడుతున్న వైకల్యాలు, ఇబ్బందులను పరిష్కరించే విషయంలో అధునాతన వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని కళాశాల పీజీ వైద్య విద్యార్థులందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అందుకే ముఖ్యమైన సబ్జెక్టును సీఎంఈ కోసం ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సీఎంఈకి ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజి నుంచి ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ జీవీ సుధాకర్, డాక్టర్ పల్యూరి లక్ష్మి, డాక్టర్ సుబోద్ కుమార్, ప్రొఫెసర్ డాక్టర్ విశాల, రిటైర్డ్ కేఎంసీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ రాజారవికుమార్, డాక్టర్ సింధుప్రియాంక, డాక్టర్ అరుణ, డాక్టర్ రూపశ్రీ, డాక్టర్ గంగాభవాని, డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ విజయచంద్రమౌళి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని అన్ని వర్గాల పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం కర్నూలు రూరల్ మండల పరిధిలో పింఛన్లు పంపిణీ చేశారు. పంచలింగాల గ్రామంలో ఎంపీ, దిన్నెదేవరపాడు గ్రామంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను దశలవారీగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవి, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, టీడీపీ నాయకులు కృష్ణ యాదవ్, సచివాలయం ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 96.78 శాతం పెన్షన్ల పంపిణీ

కర్నూలు (టౌన్) : నగర పరిధిలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు 96.78 శాతం పంపిణీ చేసినట్లు నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ వెల్లడించారు. సెప్టెంబర్ 1 వ తేది ఆదివారం కావడంతో ఒక రోజు ముందు పంపిణీ చేసినట్లు తెలిపారు. నగరంలో అన్ని రకాల పెన్షన్లు 35,744 ఉన్నాయని, ఇందులో మొదటి రోజు 34, 594 మందికి రూ. 14,83,31,500 నగదు అందజేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశం

కర్నూలు (సెంట్రల్) :రానున్న రెండు మూడు రోజులు జిల్లాలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్‌డీఓలతో ఆయా డివిజన్లలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ తదితర అన్ని శాఖల అధికారులు జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఉండి పర్యవే క్షణ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూములు 24 గంటలు పనిచేసేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిపై నివేదికలు సమర్పించాలని, అలాగే అవసరమైన చోట ఎస్‌డీఆర్‌ఎఫ్ టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పాత మిద్దెల్లో నివసిస్తున్న వారిని గుర్తించి వేరే భవనాల్లో తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో వరదలు వచ్చినప్పుడు ప్రభావితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చిప్పగిరిలో పంటలు మునక పరిస్థితిపై ఆర్‌డీఓ, తహసీల్దార్‌లతో కలెక్టర్ ఆరా తీశారు. జాయింట్ కలెక్టర్ నవ్య పరిస్థితిపై తహసీల్దార్లతో సమీక్షించారు.

రూ.3 కోట్ల అప్పుతో శనగల వ్యాపారి పరారీ

కొలిమిగుండ్ల: నంద్యాల జిల్లా తిమ్మనాయినపేటకు చెందిన ఫర్టిలైజర్, శనగల వ్యాపారి రూ.3కోట్లకు పైగా అప్పులు చేసి పరారయ్యాడు. ఆరు రోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో వస్తువులు, కుటుంబ సభ్యులతో కలిసి తాళం వేసి పరారయ్యాడు. ఇతను స్థానికంగా సుమారు 20 ఏళ్ల క్రితం ఫర్టిలైజర్ దుకాణం ఏర్పాటు చేసి ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తుండేవాడు. చుట్టుపక్క గ్రామాల రైతులతో పరిచయాలు బాగా పెంచుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత శనగల వ్యాపారం ప్రారంభించాడు. ఈకోవలోనే ఏడాది క్రితం మీర్జాపురం, బెలుం శింగవరం, నాగిరెడ్డిపల్లె, కల్వటాల, నందిపాడు,తిమ్మనాయినపేటతో పాటు అనంతపురం జిల్లా గుడిపాడుకు చెందిన రైతుల నుంచి పెద్ద మొత్తంలో శనగలు కొనుగోలు చేశాడు. గ్రామ సమీపంలో ఉన్న వేర్‌హౌస్‌లో 40 లారీలకు పైగానే శనగ బస్తాలను గుట్టు చప్పుడు కాకుండా విడతల వారీగా విక్రయించాడు. శనగలు విక్రయించిన రైతులకు అప్పు ఉన్నట్లు ప్రామిసరీ నోట్లు రాసిచ్చాడు. మరికొంత మందికి తెల్లకాగితాలపై లెక్కలు వేసి బకాయి ఉన్నట్లు చూపించాడు. ఫర్టిలైజర్ దుకాణానికి తోడు ఐదారు లారీలు కొనుగోలు చేశాడు. గ్రామంలోనే రూ.30 లక్షలు ఖర్చు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. కొద్ది రోజుల నుంచి రైతులు తమ పిల్లల చదువులకు ఫీజులు, పెళ్లిళ్లు ఇతర అవసరాలకు డబ్బు అవసరం పడటంతో వ్యాపారి ఇంటి వద్దకు తిరుగుతూ వచ్చారు. వచ్చిన వారందరికీ గడువు చెప్పి పంపేవాడు. రోజు రోజుకు రైతుల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో గుట్టు చప్పుడు కాకుండా కుటుంబంతో సహా ఊరు విడిచి పరారయ్యాడు. ఒక్క మీర్జాపురం నుంచే రూ.70 లక్షల వరకు రైతులకు ఇవ్వాల్సి ఉండగా మొత్తంగా రూ.3కోట్లకు పైగానే బకాయిలు ఉన్నట్లు తెలుస్తుంది.

స్పోర్ట్స్

6న హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 6 వ తేదీ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సువర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన జట్లు ఈనెల నెల 5 వ తేదీలోపు రూ.10 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

3న ఆట్యా పాట్యా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 3 వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి (బాయ్స్, గర్ల్స్) ఆట్యా పాట్యా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ క్రీడా సంఘం జిల్లా కార్యదర్శి బి. పవన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 13, 14 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి ఆట్యా పాట్యా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 93938-55450 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్) : ఈనెల నెల 2 వ తేదీ నరసరావుపేటలో నిర్వహించనున్న 18 వ రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా రోయింగ్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అరవింద్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఫ్లోర్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోర్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కర్నూలు ఏఓపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదు

- విశ్వనాథ్‌ను విజిలెన్స్ ఏఓగా నియమిస్తే వేధింపులు పెరుగుతాయి
- కొందరు ఇన్‌పుట్ డీలర్లు ఫిర్యాదు
- ఒకటి రెండు రోజుల్లో విచారణ చేయనున్న జిల్లా వ్యవసాయ అధికారి

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లింది. కర్నూలు మండల వ్యవసాయ అధికారిగా విశ్వనాథ్ ఆరేళ్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ కార్యాలయ ఏఓగా డిప్యుటేషన్‌పై వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై కొందరు ఇన్‌పుట్ డీలర్లు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. కల్లూరు పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలు కర్నూలు ఏఓ పరిధిలో ఉన్నప్పుడు రకరకాలుగా వేధింపులకు పాల్పడ్డారని, ఈయన కారణంగా ఇక్కడి నుంచి కొన్ని కంపెనీలు వెళ్లిపోయాయని, కొన్ని కంపెనీలు కర్నూలుకు రావాల్సి ఉండగా ఆగిపోయాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన విజిలెన్స్ ఏఓగా వస్తే వేధింపులు, ముడుపుల వ్యవహారం కొనసాగే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి రిపోర్టు ఇవ్వాలని ముఖ్యమంత్రి కార్యాలయం జిల్లా వ్యవసాయ అధికారిణి పీఎల్ వరలక్ష్మిని ఆదేశించింది. సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసిన డీలర్లు, కొందరు రైతులు జిల్లా వ్యవసాయ అధికారిణికి కూడా ఏఓ విశ్వనాథ్‌పై ఫిర్యాదు చేశారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో ఆమె విచారణ జరపనున్నారు.

ఈరోజు

నగర బ్రాహ్మణుల సమావేశం

కర్నూలు(అర్బన్): నగరంలోని సంకల్‌బాగ్ శ్రీ వెంకటేశ్వర స్వామి, భవాని సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం హరిహర క్షేత్రంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నగర బ్రాహ్మణుల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సభ్యులు చల్లా నాగరాజు శర్మ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగర బ్రాహ్మణ సంఘానికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున అందరి అభిప్రాయాలను స్వీకరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వెంకటేశ్వర స్వామి గుడిలో రుద్రాభిషేకాలు

కర్నూలు కల్చరల్: మాస శివరాత్రిని పురస్కరించుకొని సంకల్‌బాగ్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమాలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గుడ్లవల్లేరు కాలేజీ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

- దోషులను కఠినంగా శిక్షించాలి
- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
- ఆర్‌ఎస్ రోడ్డులో నిరసన



ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్.ఎస్ రోడ్డులో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు సిటీ: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన దారుణంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అఖిల భారత విద్యార్థి సంఘం (ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్) నాయకులు డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థినుల వాష్‌రూముల్లో సీక్రెట్ కెమెరాలు ఏర్పాటు చేసి వీడియోలు తీయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు శనివారం ఆర్‌ఎస్ రోడ్డు సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో అమ్మాయిలు, మహిళలపై దాడులు పెరిగిపోయాయని, వారికి రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థినుల వాష్‌రూముల్లో హిడెన్ కెమెరాలు అమర్చి వీడియోలు తీయడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సదరు విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల క్రితమే హాస్టల్ విద్యార్థినులు హిడెన్ కెమెరాల విషయాన్ని కాలేజీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఊహించరానిదన్నారు. ఈ ఘటనకు కారకులెవరో గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్దయ్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.